

చెత్తకు నిప్పు.. చెట్లకు ముప్పు

వేల్పూర్ మండలంలోని అమీనాపూర్ సమీపంలో చెత్తకు నిప్పు పెట్టగా, హరితహారం చెట్ల మొదళ్లు కాలిపోయాయి.

- 8లో ▸



ఫీల్డ్ అసిస్టెంట్ల నిరసన..

సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు నిరసన బాట పట్టారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.1 /25.0

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమవుతుంది. క్రమంగా ఎండతీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సొసైటీకి తాళం వేసిన రైతులు



రుద్రూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు ఇవ్వడం లేదని, హమాలీల కొరత ఉందని ఆరోపిస్తూ మండలంలోని ఎత్తొండ సొసైటీకి రైతులు బుధవారం తాళం వేసి ఆందోళన చేశారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రంలో సమస్యల గురించి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం వద్ద నిల్వ ఉంచి రోజులు గడుస్తున్నాయని, అకాల వర్షం కురిస్తే ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కొనుగోలు కేంద్రంలో సమస్యలను పరిష్కరించి గన్నీ బ్యాగులను, హమాలీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

డంపింగ్‌యార్డ్‌లో బోర్ పాయింట్ల గుర్తింపు



నిజామాబాద్ సిటీ: నగర శివారులోని నాగారం డంపింగ్‌యార్డులో బోర్ వేసే పాయింట్లను గుర్తించారు. ఈమేరకు బుధవారం జియాలజిస్ట్ బృందం సభ్యులు నిఖిత్ పర్వీన్, హరీష్, ధర్మయ్య యార్డును పరిశీలించి, రెండు చోట్ల బోర్ పాయింట్లను గుర్తించారు. త్వరలోనే బోర్లు వేసి నీటి వసతి కల్పించనున్నట్లు ఏఎంసీ జయకుమార్ తెలిపారు. మున్సిపల్ శానిటేషన్ సూపర్‌వైజర్ సాజిద్ అలీ, డంపింగ్‌యార్డు ఇన్‌చార్జి ప్రభుదాస్, మున్సిపల్ ఏఈలు ఇనాయత్‌కరీం, సల్మాన్ ఖాన్, సూపరింటెండెంట్ రాకేశ్ తదితరులు ఉన్నారు.

జిల్లాకు నేడు డీఎంఈ రాక

నిజామాబాద్‌నాగారం: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) నరేంద్రకుమార్, టీజీఎంఐడీసీ సీఈ దేవేందర్ గురువారం జిల్లా కేంద్రానికి రానున్నారు. జిల్లాకేంద్రంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రం, క్రిటికల్ కేర్ విభాగాన్ని వారు పరిశీలించనున్నారు. సదరు విభాగాలను గతేడాది డిసెంబర్‌లో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. కానీ లిఫ్టులు, ఇతర పరికరాలు అందుబాటులో లేకపోవడంతో సంబంధిత అధికారులు భవనాన్ని అలాగే ఉంచిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కేంద్రానికి అవసరమైన నాలుగు లిఫ్టులు, ఇతర పరికరాలను వారు మంజూరు చేయనున్నట్లు తెలిసింది. తదుపరి జీజీహెచ్‌లో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు.. పక్కన ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు, సబ్ కలెక్టర్ వికాస్



■ ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం జిల్లాలో పర్యటించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలపై సమగ్రంగా చర్చించారు. ఆర్మూర్‌లో సన్నబియ్యం లబ్ధిదారు ఇంట్లో భోజనం చేశారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. భీమ్‌గల్‌లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు.

ఇదేం పద్ధతి..?

నీటి సరఫరా తీరుపై ఇన్‌చార్జి మంత్రి జూపల్లి అసహనం

- మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్లు ఎందుకు రాలేదు..?
- కలెక్టర్‌ను ప్రశ్నించిన మంత్రి
- సమస్యలను తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయండి
- సమీక్ష సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో వేసవి సీజన్‌కు సంబంధించి తాగునీటి సరఫరా తీరుపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అసహనం వ్యక్తం చేశారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లాస్థాయి సమీక్షాసమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు పి సుదర్శన్‌రెడ్డి, భూపతి రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకాగా, వ్యవసాయం, తాగునీటి సరఫరా, మార్కెటింగ్, పౌరసరఫరాలు, హౌసింగ్, భూ భారతిపై సమగ్రంగా చర్చించారు.

భీమ్‌గల్‌లో నీటి సమస్య ఉందని బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి మంత్రికి తెలుపగా, సంబంధిత అధికారి ఎవరని ఆయన ఆరా తీయగా, సదరు అధికారి అందుబాటులో లేడు. దీంతో కలెక్టర్‌ను మంత్రి ప్రశ్నించగా.. మండల, మున్సిపాలిటీల స్పెషల్ ఆఫీసర్లను సమావేశానికి పిలవలేదని, కేవలం జిల్లా స్థాయి అధికారులను మాత్రమే పిలిచామని ఆయన సమాధానమివ్వడంతో మంత్రి అసహనం వ్యక్తం చేశారు. ప్రతి వ్యక్తికి 100 లీటర్ల నీరు సరఫరా చేయాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని, మిషన్ భగీరథకు సంబంధించి నీటి సరఫరా రికార్డు నమోదవుతోందా.. అని అధికారులను ప్రశ్నించగా, వారు సరైన సమాధానం చెప్పలేదు. నీటి సరఫరాకు సంబంధించి నిధులను ఎలా కేటాయిస్తున్నారని, ప్రతి వెయ్యి లీటర్లకు ఎన్ని డబ్బులు చెల్లిస్తున్నారని మంత్రి ప్రశ్నించగా.. లీటర్ల చొప్పున కాదని.. పనిచేసే సిబ్బంది చొప్పున నిధులు కేటాయిస్తున్నామని అధికారులు సమాధానమివ్వగా ఇదేమి పద్ధతి అని ప్రశ్నించారు.

ఇందిరమ్మ ఇళ్లు..

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులను ఎంపిక చేయాలని, ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గొద్దని, అక్రమాలకు తావిస్తే రికవరీ చేయిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఇళ్ల నిర్మాణం చేపట్టే ఆర్థిక స్తోమత లేని పేదలకు ఐకేపీ మహిళా సంఘాల ద్వారా ఇళ్లను నిర్మించి ఆ తరువాత బిల్లులను మహిళా సంఘాలకు అందించేలా చొరవ చూపాలని ఆదేశించారు.

వెంటనే ఫోన్‌లో సంబంధిత కమిషనర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వారం రోజుల్లో ఈ వ్యవహారంపై సరైన వివరణ ఇవ్వాలని ఆదేశించారు. నీటిసరఫరాకు సంబంధించిన సమస్యలను తెలుసుకునేందుకు కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే అన్ని శాఖలకు సంబంధించి మరో టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంటే బాగుంటుందని కలెక్టర్‌కు సూచించారు.

వేసవిలో ఏ ఒక్క నివాస ప్రాంతంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, స్థానికంగా నీటి వనరులు లేని ప్రాంతాల్లో బోరుబావులు అద్దెకు తీసుకోవాలని, ట్యాంకర్ల ద్వారా రక్షిత మంచి నీటిని సరఫరా చేయాలని మంత్రి ఆదేశించారు. అధికారులు వాస్తవ నివేదికలు ఇవ్వాలన్నారు.

పౌరసరఫరాలు..

ధాన్యం సేకరణ ప్రణాళికాబద్ధంగా కొనసాగుతోందని, జిల్లా నుంచి ఆదిలాబాద్, మెదక్, సంగారెడ్డి, మేడ్చల్ తదితర జిల్లాలకు సన్న బియ్యం సరఫరా చేస్తుండడం అభినందనీయమని మంత్రి అన్నారు. 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేలా ప్రణాళికలు రూపొందించామని కలెక్టర్ మంత్రికి తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం అయిన వెంటనే రైతులకు పూర్తి వివరాలతో రసీదులు అందించాలని మంత్రి ఆదేశించారు.

భూ భారతి..

ధరణి కారణంగా ఇబ్బందులు పడిన రైతులకు ఊరట కలిగేలా భూ భారతిని ప్రభుత్వం తీసుకొచ్చిందని మంత్రి అన్నారు. రైతుల భూ సమస్యలను పరిష్కరించేలా చొరవ చూపాలని, మండల, గ్రామ స్థాయిలో రైతులతో సదస్సులను నిర్వహించేందుకు నిర్దీత షెడ్యూల్ ఖరారు చేసుకోవాలని సూచించారు.

కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను రెండు రోజుల్లో అందించాలని, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలిస్తూ పక్షం రోజుల్లో మంజూరయ్యేలా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, వ్యవసాయ, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ..

సన్న బియ్యం పంపిణీ సజావుగా సాగేలా పర్యవేక్షించాలని, రేషన్ డీలర్ల ఖాళీలను నెల రోజుల్లోగా పూర్తి స్థాయిలో భర్తీ చేయాలని మంత్రి ఆదేశించారు. రేషన్ దుకాణాలకు సరైన నిష్పత్తిలో కోటా కేటాయింపులు జరిగేలా చూడాలన్నారు.

పేదల కడుపు నింపేందుకే సన్నబియ్యం



లబ్ధిదారు ఇంట్లో భోజనం చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పెర్కిట్(ఆర్మూర్): పేద, సామాన్య ప్రజల కడుపు నింపేందుకే రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేపట్టిందని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి రేషన్ లబ్ధిదారుడు లక్కారం తవ్వన్న ఇంట్లో సన్నబియ్యంతో మంత్రి బుధవారం భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో పంపిణీ చేసిన దొడ్డు బియ్యాన్ని తినేందుకు లబ్ధిదారులు విముఖత చూపుతూ ఇతరులకు విక్రయించి మార్కెట్‌లో సన్న బియ్యం కొనుగోలు చేసుకునే వారన్నారు. ప్రభుత్వానికి భారమైనా పేదలకోసం సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల నిరసన

మోర్తాడ్(బాల్కొండ): భీమ్‌గల్‌లో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీకి కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు నిరసన సెగ తగిలింది. తులం బంగారం ఏమైందంటూ బీఆర్‌ఎస్ శ్రేణులు ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఒక దశలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తోసుకుంటూ సభా వేదిక వద్దకు వచ్చే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. చెక్కుల పంపిణీ వేదిక బయట కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గుమిగూడి బల ప్రదర్శనకు దిగారు. దీంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరువర్గాల వారిని సముదాయించడానికి పోలీసులు ఎంతో శ్రమించారు. స్వల్ప లాఠీచార్జి చేయడంతో కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మొదట పోలీసు అధికారులు ఫోన్‌లో ప్రశాంత్‌రెడ్డితో మాట్లాడి ధర్నా కార్యక్రమం విరమించాలని కోరారు. చివరకు ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి భీమ్‌గల్‌కు చేరుకుని లాఠీచార్జి చేసినట్లు, కావాలని గాయపరిచినట్లు ఆధారాలు ఉంటే చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ప్రశాంత్‌రెడ్డి తన నిరసనను విరమించి వెళ్లిపోయారు.



కార్యకర్తలతో కలిసి రోడ్డుపై బైఠాయించిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

ఉద్యమాలు మాకు కొత్త కాదు

ఉద్యమాలు బీఆర్‌ఎస్‌కు కొత్త కాదని ఉద్యమంతోనే తమ పార్టీ పురుడుపోసుకుందని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ధర్నా ముగించి వెళ్లే ముందు కార్యకర్తలు, నాయకులతో ఆయన మాట్లాడారు. లాఠీచార్జి చేసిన పోలీసులను వదలిపెట్టేది లేదని హెచ్చరించారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు

ఇసుక చల్లడంతోనే వివాదం ముదిరిందా..?

మోర్తాడ్: భీమ్‌గల్‌లో పోలీసులు లాఠీచార్జీ చేయడానికి కొందరు వ్యక్తులు ఇసుక చల్లడమే కారణమని తెలుస్తోంది. కార్యక్రమం ముగిసిన అనంతరం మంత్రి తన వాహనం ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు పోలీసులపై ఇసుక చల్లి కనిపించకుండా చేయడంతో స్వల్ప లాఠీచార్జి చేసినట్లు తెలిసింది. ఇసుక చల్లిన వ్యక్తులను గుర్తించడానికి పోలీసులు వీడియోలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇసుకను చల్లి పోలీసులకు కనిపించకుండా చేయడం ద్వారా మంత్రి కాన్వాయ్‌కు ఏదైనా హాని తలపెట్టాలని చూశారా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. కావాలనే ఉద్రిక్తతలను సృష్టించేందుకు ఇసుక చల్లి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటన జరిగిన చోట ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించే పనిలో పోలీసులు ఉన్నారు.

అల్ప్రాజోలం పట్టివేత



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ట్రైయినీ ఐపీఎస్ సాయికిరణ్

నిజామాబాద్‌రూరల్: నిజామాబాద్ నగరంలోని జీజీ కాలేజ్ సమీపంలో ఉన్న హనుమాన్ ఆలయం వద్ద కిలో అల్ప్రాజోలం, రూ.3.50 లక్షల నగదును మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ట్రైయినీ ఐపీఎస్ సాయికిరణ్ తెలిపారు. నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నిర్మల్ జిల్లాకు చెందిన పాత నేరస్తుడు గంధం శ్రీనివాస్ కారులో వచ్చి జీజీ కాలేజ్ సమీపంలో అల్ప్రాజోలం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో రూరల్ పోలీసులు అతడిని పట్టుకున్నారు. నిందితుడు ఇప్పటి వరకు ఎవరెవరికి విక్రయించాడనే వివరాలు సేకరించారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బొట్లకుంట కాటమయ్య గౌడ్, మల్లి అనిల్‌గౌడ్, ఇడిగి శ్రీనివాస్‌కు అల్ప్రాజోలం విక్రయించినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. అప్పటికే మహబూబ్‌నగర్ జిల్లాకు చెందినవారు వెళ్లిపోవడంతో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితుడితో ఫోన్ చేయించి వారు రాగానే అరెస్టు చేశారు. నిందితుల నుంచి కిలో అల్ప్రాజోలం, రూ.3.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

జిల్లాలో 'మైనర్ స్పెషల్ డ్రైవ్'

- వాహనాలు నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలు
- తల్లిదండ్రులు, వాహన యజమానికి జైలు శిక్ష
- వాహన రిజిస్ట్రేషన్ రద్దు

ఖలీల్‌వాడి: జిల్లాలో ఇక నుంచి 'మైనర్ స్పెషల్ డ్రైవ్' నిర్వహించనున్నట్లు సీపీ సాయిచైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానాలు విధించేవారమని, ఇక నుంచి కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



సీపీ సాయిచైతన్య

మైనర్లు వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ఇక నుంచి మైనర్ డ్రైవింగ్ చేస్తూ దొరికితే తల్లిదండ్రులు లేదా వాహన యజమానిని ఎంవీఐ యాక్ట్–2019, సెక్షన్ 199–ఏ ప్రకారం కోర్టులో హాజరుస్తామని పేర్కొన్నారు. వాహన యజమానికి న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్ష, రూ.25 వేల వరకు జరిమానా విధిస్తుందని తెలిపారు. వాహనం నడుపుతూ పట్టుబడిన మైనర్ 25 ఏళ్లు నిండే వరకు డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు అర్హత ఉండదని, వాహనం రిజిస్ట్రేషన్‌ను సంవత్సరం వరకు రద్దవుతుందని పేర్కొన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సీపీ సూచించారు.

శుభకార్యాల సందడి

నిజామాబాద్ రూరల్: జిల్లాలో మళ్లీ శుభకార్యాల సందడి నెలకొంది. ఏప్రిల్, మే నెలల్లో ముహూర్తాలు ఎక్కువగా ఉండటంతో భారీ సంఖ్యలో పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉందని అర్చకులు పేర్కొంటున్నారు. జూన్ 11నుంచి జూలై 12వ తేదీ వరకు ఆషాఢమాసంలో ముహూర్తాలేవని, మళ్లీ జూలై 25నుంచి శ్రావణమాసంలో మంచి రోజులు ఉన్నట్లు వారు తెలిపారు. ఏప్రిల్ 30న అక్షయ తృతీయ సందర్భంగా పెళ్లిళ్లు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది.



ముహూర్తాలు ఇవే..

ఏప్రిల్ 16, 18, 20, 21, 23, 30.. మే 1, 3, 4, 8, 9, 10, 11, 14, 16, 18, 19, 21, 23, 24, 30

బంగారం ధరకు రెక్కలు



శుభకార్యాల వేళ బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. బుధవారం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ఏకంగా రూ.95 వేలకు చేరువైంది. వచ్చే వారంలో రూ.లక్షకు చేరొచ్చని బంగారం వర్తకులు పేర్కొంటున్నారు. వెండి కిలో రూ.లక్ష దాటిందని తెలిపారు.

రూ.లక్షకు చేరుకుంటుంది



వచ్చే వారంలో 24 క్యారెట్ల బంగారం ధర లక్ష రూపాయలకు చేరుకుంటుంది. బుధవారం ఒక్కరోజే రెండుసార్లు ధర పెరిగింది. బంగారు ధరలు పెరుగుతుండడంతో పేద, మధ్య తరగతి వారు ఆందోళన చెందుతున్నారు.

– చిలువేరి గణేశ్, బంగారం వ్యాపారి

పోలీసుల అత్యుత్సాహం



వృద్ధురాలు కూర్చున్న ఆటోను చుట్టుముట్టిన పోలీసులు.. ఆటోలో వృద్ధురాలు (ఇన్‌సెట్‌లో..)

నిజామాబాద్‌అర్బన్: సమస్యను విన్నవించుకునేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన ఓ వృద్ధురాలి విషయంలో పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. శ్రీనగర్‌కు చెందిన సరస్వతి అనే వృద్ధురాలు తన సమస్యను ఉన్నతాధికారులకు తెలిపేందుకు బుధవారం కలెక్టరేట్‌కు వచ్చింది. అదే సమయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష సమావేశం ప్రారంభం కానుండటంతో పోలీసులు ఆమెను చుట్టుముట్టి ఇక్కడికి రావొద్దంటూనే బలవంతంగా బయటికి తీసుకెళ్లారు. ఆటోను పిలిపించి ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లతో ఆర్టీసీ బస్టాండ్‌కు తీసుకెళ్లి వదిలిపెట్టారు. ఎండలో తిప్పలు పడుతూ అధికారులను కలిసేందుకు తాను వస్తే పోలీసులు వెనక్కి పంపించేశారని వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. మంత్రులు, అధికారులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలి కానీ ఇలా సమస్యను విన్నవించుకోవడానికి వచ్చిన వృద్ధురాలిని వెనక్కి పంపించడమేమిటని పలువురు చర్చించుకున్నారు.

నేటి నుంచి భూ భారతి సదస్సులు

- ఈ నెలాఖరు వరకు మండల కేంద్రాల్లో నిర్వహణ
- మోర్తాడ్ నుంచి శ్రీకారం

మోర్తాడ్(బాల్కొండ): ధరణి స్థానంలో కొత్తగా తీసుకొచ్చిన భూ భారతి పోర్టల్ పనితీరు, భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మోర్తాడ్‌లో గురువారం మొదటి అవగాహన సదస్సు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. కార్యక్రమానికి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు హాజరుకానున్నారు. ఈ నెలాఖరు వరకు అన్ని మండల కేంద్రాల్లో భూ భారతి అమలుపై రైతుల భాగస్వామ్యంతో సమావేశాలను నిర్వహించనున్నారు. అవగాహన సదస్సు నిర్వహించే ముందు రోజు గ్రామాల్లో దండోరా వేయించనున్నారు. రెవెన్యూ ఉన్నతాధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్‌ల పర్యవేక్షణలో భూ భారతి అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని అధికారులకు ఆదేశాలు అందాయి.

ప్రభుత్వం భూములకు సంబంధించిన అన్ని వివాదాలను పరిష్కరిస్తామని చెబుతోంది. ఆయా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే దీనిని తీసుకువచ్చామంటోంది. ఈ నేపథ్యంలో అవగాహన సదస్సుల ద్వారా రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకునే వీలు ఏర్పడనుంది.

సందేహాలను నివృత్తి చేసేందుకే..

కొత్తగా అందుబాటులోకి తీసుకువచ్చిన భూ భారతి పోర్టల్‌పై సందేహాలను నివృత్తి చేసేందుకే అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. రైతులు స్వచ్ఛందంగా సమావేశాలకు హాజరు కావాలి. ఎలాంటి అనుమానాలు ఉన్నా వాటికి సమాధానం రాబట్టుకోవాలి.

– కృష్ణ, తహసీల్దార్, మోర్తాడ్

ఫీల్డ్ అసిస్టెంట్ల నిరసన బాట

- మూడు నెలలుగా అందని వేతనాలు
- ఇబ్బందుల్లో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు



ఏర్గట్లలో ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

మోర్తాడ్: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు నిరసనబాట చేపట్టారు. మూడు నెలల నుంచి వేతనాలు అందక పోవడం, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చక పోవడంపై నిరసన తెలుపుతూ బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి మండలాల వారిగా అధికార యంత్రాంగానికి వినతిపత్రాలు అందించారు. దశల వారిగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఫీల్డ్ అసిస్టెంట్ల రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు కార్యాచరణ అమలు చేస్తున్నారు. జిల్లాలోని 530(పునర్విభజన చేయడానికి ముందు ఉన్న) గ్రామ పంచాయతీలకు గాను 275 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. గడిచిన జనవరి నెల నుంచి వేతనాలు అందక పోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఉద్యోగ భద్రత, పే స్కేల్ అమలు ఇతరత్రా డిమాండ్లను నెరవేర్చాలని కోరుతున్నారు. ఉపాధి హామీ కూలీలకు పనులు చూపడంతో పాటు హరితహారం, నర్సరీల నిర్వహణ ఇతరత్రా పనులు చేస్తున్నా తమ శ్రమకు గుర్తింపు లేదని వారు వాపోయారు. నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన చేపట్టాలని నిర్ణయించారు.

ప్రభుత్వం స్పందించాలి

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి. ఎన్నో ఏళ్లుగా శ్రమ దోపిడీకి గురవుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. కూలీలకు, ప్రభుత్వ యంత్రాంగానికి వారధిగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల డిమాండ్లను నెరవేర్చాలి. – రామరాజు, ఫీల్డ్ అసిస్టెంట్, తొర్తి

న్యాయవాదులు న్యాయ వ్యవస్థకు కీలక బలం



నూతన కార్యవర్గ సభ్యులతో జడ్జి నసీమ్ సుల్తానా

ఆర్మూర్‌టౌన్: న్యాయవాదులు న్యాయ వ్యవస్థకు కీలక బలమని, న్యాయమూర్తులు, న్యాయవాదులు పరస్పర గౌరవంతో పనిచేస్తేనే ప్రజలకు సమర్థవంతమైన న్యాయం అందుతుందని సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా అన్నారు. ఆర్మూర్ కోర్టులోని న్యాయవాదుల బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారానికి జడ్జి హాజరై మాట్లాడారు. నూతన కార్యవర్గం న్యాయవాదుల బార్ అసిసియేషన్ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణా స్వీకారం చేశారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి, అడిషనల్ జడ్జి సరళరాణి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల శ్రీధర్, జెస్సు అనిల్, ఉపాధ్యక్షుడు గటడి ఆనంద్, కోశాధికారి గజ్జెల, చైతన్య, సంయుక్త కార్యదర్శి గంగారాం, సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

చెత్తకు నిప్పు.. చెట్లకు ముప్పు



అమీనాపూర్-వేల్పూర్ రహదారి మధ్యలో చెత్తకు నిప్పుపెట్టడంతో చెట్లకు నిప్పు అంటుకున్న దృశ్యం

వేల్పూర్: మండలంలోని అమీనాపూర్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పుపెట్టడంతో సమీపంలోని హరితహారం చెట్లు దెబ్బ తింటున్నాయి. దీంతో అవి మొదళ్ల వద్ద కాలి బలహీనమై బలమైన గాలులు వీస్తే విరిగిపోయే స్థితికి చేరుకున్నాయి. వేల్పూర్ నుంచి 63వ నంబర్ జాతీయ రహదారి వరకు దివంగత వేముల సురేందర్‌రెడ్డి యాభై ఏళ్ల క్రితం మొక్కలు నాటించగా వృక్షాలుగా మారాయి. వీటికి తోడు 2016లో మాజీ సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమంలో భాగంగా మోతె గ్రామానికి వచ్చినప్పుడు మోతె నుంచి వేల్పూర్ మీదుగా 63 నంబరు జాతీయ రహదారి వరకు వేలాది మొక్కలు నాటారు. వాటిని పదేళ్ల పాటు హరితహారం కార్యక్రమం ద్వారా నీరుపోసి సంరక్షించగా భారీ చెట్లుగా రూపుదిద్దుకున్నాయి. రహదారికి ఇరువైపులా పంటలకు నీడ వచ్చి దిగుబడి రాకుండా చేస్తున్నాయని కొందరు నరికి వేస్తుండగా, మరికొన్ని చోట్ల వృక్షాల మొదళ్ల వద్ద చెత్తను తగులబెడుతున్నారు.

దీంతో చెట్ల మొదళ్లు కాలిపోయి బలం కోల్పోతున్నాయి. అధికారులు స్పందించి చెట్లకు నిప్పు పెట్టకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

23 వరకు డిగ్రీ ప్రాక్టికల్స్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో ప్రాక్టికల్ / ప్రాజెక్టు పరీక్షలను ఈ నెల 16 నుంచి 23 వరకు నిర్వహించాలని కంట్రోలర్ ప్రొఫెసర్ కె సంపత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీ పరిధిలోని అన్ని అనుబంధ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్ల పర్యవేక్షణలో ప్రాక్టికల్స్/ ప్రాజెక్టు పరీక్షలు నిర్వహించి వెంటనే మార్కులను ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేయాల్సిందిగా కంట్రోలర్ తెలిపారు. పూర్తి వివరాలను తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

కామర్స్‌లో డాక్టరేట్



కామర్స్ విభాగంలో డాక్టరేట్ సాధించిన రంజిత

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ కామర్స్ విభాగంలో పరిశోధక విద్యార్థిని కె రంజిత పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించారు. తెయూ కామర్స్ అధ్యాపకులు, రిజిస్ట్రార్ యాదగిరి పర్యవేక్షణలో 'అకౌంటింగ్ పాలసీస్ అండ్ ప్రాక్టీసెస్ ఇన్ మున్సిపల్ కార్పొరేషన్ – ఏ స్టడీ ఆఫ్ నిజామాబాద్ డిస్ట్రిక్ట్, తెలంగాణస్టేట్' అనే అంశంపై రంజిత పరిశోధన పూర్తి చేసి సిద్ధాంత గ్రంథం మంగళవారం సమర్పించారు. రంజిత గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ నిజామాబాద్ లో కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అనంతరం రంజితను వీసీ యాదగిరిరావు,రిజిస్ట్రార్ యాదగిరి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కామర్స్ డీన్ రాంబాబు, అధ్యాపకులు శ్రీనివాస్, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణం చేయొద్దు

ఖలీల్‌వాడి: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణం చేపటొద్దని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, సీఐ ప్రసాద్ ఆటో డ్రైవర్లకు సూచించారు. నగరంలోని ట్రాఫిక్ పీఎస్‌లో ఆటో డ్రైవర్లకు పలు అంశాలపై సూచనలు చేశారు. డ్రైవర్ సీటు పక్కన మరో సీటు పెట్టవద్దని, విధిగా యూనిఫామ్ ధరించాలన్నారు. ఎక్కువ ప్యాసింజర్లను ఎక్కించుకోరాదని, నంబర్ల ప్లేట్ లేని ఆటోలను నడపరాదని సూచించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని సూచించారు.

ఇన్‌చార్జి మంత్రిని కలిసిన సీపీ



మంత్రికి పూలమొక్కను అందజేస్తున్న సీపీ

నిజామాబాద్‌అర్బన్/ ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును సీపీ సాయిచైతన్య మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. అలాగే జర్నలిస్టుల సమస్యలపై స్పందించాలని కోరు తూ టీయూడబ్ల్యూజే ఐజే యూ నాయకులు ఇన్‌చార్జి మంత్రికి వినతిపత్రం అందజేశారు.

ఉమ్మడి కుటుంబ సంస్కృతి కొనసాగాలి



లక్కారం తవ్వన్న కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పెర్కిట్(ఆర్మూర్): ఆధునిక సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగవుతుండడంతో ఆనందానికి దూరమవుతున్నారని, ఉమ్మడి కుటుంబ సంస్కృతి కొనసాగాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లికి చెందిన లక్కారం తవ్వన్న ఉమ్మడి కుటుంబంతో కలిసి సన్నబియ్యంతో భోజనం చేసిన మంత్రి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆనందం వ్యక్తం చేశారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ద్వారా ఎన్నో సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. మంత్రి వెంట ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు పొద్దుటూరి వినయ్‌రెడ్డి, ముత్యాల సునీల్‌రెడ్డి, డీఏస్‌వో అరవింద్‌రెడ్డి, సివిల్ సప్లయిస్ డీఎం శ్రీకాంత్‌రెడ్డి, ఆర్డీవో రాజాగౌడ్, నాయకులు వెంకట్రాం రెడ్డి, మారుతిరెడ్డి, రవిగౌడ్, కాశీరాం, కొంతం మురళీధర్ తదితరులు ఉన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



పోషణపక్షంను ప్రారంభిస్తున్న అధికారులు

నిజామాబాద్‌నాగారం: అంగన్‌వాడికి వచ్చే బాలింతలకు, గర్భిణులకు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలని అడిషనల్ కలెక్టర్ అంకిత్ సిబ్బందికి సూచించారు. పిల్లల్లో పోషకాహార లోపం నివారించడానికే జాతీయ పోషణ పక్షం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఏడవ జాతీయ పోషణ పక్షం–2025 కార్యక్రమాన్ని జిల్లా సంక్షేమాధికారి షేక్ రసూల్‌బీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అడిషనల్ కలెక్టర్ హాజరై మాట్లాడారు. పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించాలన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి ఉండే విధంగా చూసుకోవాలన్నారు. జిల్లా ఆయుష్ కో–ఆర్డినేటర్ సాయగౌడ్, డీఎంహెచ్‌వో రాజశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభపై విస్తృత ప్రచారం



వేల్పూర్‌లో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి వాల్ రైటింగ్

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు ఆ పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం చేస్తున్నాయి. ఈనెల 27వ తేదీన సభ నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఎన్నికల ప్రచారం తరహాలో విస్తృతంగా వాల్‌రైటింగ్ చేయిస్తున్నారు. మండల కేంద్రాలు, గ్రామాల్లోనూ జనం ఎక్కువగా తిరిగే ప్రదేశాల్లో వాల్ రైటింగ్‌ను చేయించారు. ఎన్నికల్లో వాల్ రైటింగ్ చేయాలంటే ఎన్నికల అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంది. ఇవి సాధారణ రోజులు కాబట్టి ఇంటి యజమాని అనుమతితో వాల్ రైటింగ్‌ను నిర్వహిస్తున్నారు. వేల్పూర్‌లో చేసిన వాల్ రైటింగ్‌ను ఇటీవల బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి స్వయంగా పరిశీలించారు. అలాగే సభకు జనంను ఎక్కువగా తరలించడానికి కార్యకర్తలు కుల సంఘాల వారీగా సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఏదేమైనా ఎన్నికల ప్రచారం తలపించేలా వాల్ రైటింగ్ చేయిస్తుండటంపై పలువురు చర్చించుకుంటున్నారు. – మోర్తాడ్

మెడికల్ షాపు లైసెన్స్ రద్దు



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఖలీల్‌వాడీలో ఉన్న గిరిజా మెడికల్ దుకాణం లైసెన్సును రద్దు చేసినట్లు కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ బుధవారం తెలిపారు. మెడికల్ దుకాణంలో ఫార్మసిస్టు, రికార్డులు లేకపోవడం, ఎప్పటికప్పుడు రోజువారీగా నమోదు చేయాల్సిన బిల్స్ కూడా ప్రాపర్‌గా నమోదు కాకపోవడాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతోనే లైసెన్సును రద్దు చేసి తాత్కాలికంగా మెడికల్ షాపును మూసివేసినట్లు తెలిపారు.

ఉద్యానవన పంటలతో రైతులకు లాభాలు

- తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి
- డీఆర్‌డీవో సురేందర్



మునగ పంటను పరిశీలిస్తున్న సురేందర్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఉపాధిహామీ పథకంలో ఉద్యానవన పంటలను పెంచుకునే అవకాశముందని, ఉద్యానవన పంటలు రైతులకు ఎంతో లాభదాయకమని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. ఆయన బుధవారం తాడ్వాయి శివారులో ఉద్యానవన పంటలో భాగంగా వేసిన మునగ పంట పెంపకంను పరిశీలించారు. మొక్కల పెంకం, మునక్కాయల దిగుబడిని రైతును అడిగి తెలుసుకున్నారు. ఎకరానికి సుమారు వేయి మొక్కల చొప్పున రెండు ఎకరాలలో రెండువేల మొక్కలను నాటామని, క్వింటాల్ మునగ కాయకు మార్కెట్లో రూ. 2వేలు వస్తాయని రైతు సమధానం ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 400ఎకరాలలో ఉద్యానవన పంటలను పెంచుకునేందుకు అవకాశముందని, ఆసక్తిగల రైతులు ముందుకు రావాలన్నారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి పొందే అవకాశముందని తెలిపారు. అనంతరం మండలపరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డు అసిస్టెంటులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పండ్ల తోటల పెంపకం నిమిత్తం ప్రతి గ్రామం నుంచి ఒకరి నుంచి ఐదుగురి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ, ఎంపీవో సవితారెడ్డి, ఏపీవో కృష్ణగౌడ్, టెక్నికల్ అసిస్టెంట్లు స్వామి, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖలో బదిలీలు చేపట్టండి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

ఖలీల్ వాడి: ఎక్సైజ్ శాఖలో బదిలీలు చేపట్టాలని మంత్రి జూపల్లి కృష్ణారావుకు ప్రొబేషనరీ అండ్ ఎక్సైజ్ ఉమ్మడి జిల్లా హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. బుధవారం జిల్లా కేంద్రానికి విచ్చేసిన మంత్రికి హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ విన్నవించారు. ఎనిమిదేళ్ల నుంచి బదిలీలు జరగలేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి సానుకూలంగా స్పందించి, ఎలక్షన్ కోడ్ ఉండటంతో ఎక్సైజ్ శాఖలో బదిలీలు ఆలస్యమైనట్లు చెప్పారు. మే నెలలో బదిలీలు చేయాలని కమిషనర్‌కి చెప్పినట్లు తెలిపారు. ప్రెసిడెంట్ రవి కుమార్, సెక్రెటరీ చంద్రమోహన్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ భోజన్న, ప్రెస్ సెక్రటరీ ఉత్తమ్, జాయింట్ సెక్రెటరీ మంజుల తదితరులున్నారు.

మంజీర తీరాన ఆధ్యాత్మిక శోభ



నరేంద్రాచార్య మహరాజ్ పాదుకా దర్శనం కోసం ఏర్పాటు చేసిన వేదికపై వేదపండితులు

బోధన్: సాలూర మండలం మందర్నాలో బుధవారం అనంత విభూషిత జగద్గురు రామానందచార్య దక్షిణ పీఠం నానీజ్‌ధాం పీఠాధిపతి స్వామి నరేంద్రచార్య పాదుక దర్శన కార్యక్రమాన్ని జిల్లా స్వ-స్వరూప్ సాంప్రదాయ్ సేవా సమితి ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. మహారాష్ట్ర, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారి నామ స్మరణతో సభ మారుమోగింది. గ్రామ శివారులోని కాశీనాథ శివాలయం వద్ద స్వామి వారి పాదుకాలకు పూజ చేసి, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలో ఉంచి శోభాయాత్రను ప్రారంభించారు. వేదికపై గురుపూజ, ఉపాసక దీక్ష, మంగళహారతి వేడుకను నిర్వహించారు. అనంతరం నానీజ్‌ధాం పీఠం ప్రతినిధులు ప్రవచనాలు చేశారు. సమాజంలో ఆధ్యాత్మిక జ్ఞానం, సామాజిక సేవా దృక్పథం పెంపొందించి లోక కల్యాణార్థం స్వామి వారి పాదుకా దర్శన కార్యక్రమం ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు కకసాహేబ్ వన్నారే, సుధాకర్ అడ్కినే, లోచన్ రౌత్ సాహెబ్, గోవింద్ ఉపాసే, సాయినాథ్ ఖధాల్, సాయి ముప్పి, గంగాధర్, మందర్నా రవి, ప్రదీప్ గుప్తా, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

క్రైం కార్నర్

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

నవీపేట: అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై వినయ్ బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నవీపేట మండలం ఫకీరాబాద్ గ్రామానికి చెందిన నీరడి శ్రీనివాస్(26) పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. గత నెల 18న పశువుల గడ్డి కోసం ఇంటి నుంచి బయటికి వెళ్లిన అతను తిరిగి రాలేదు. భార్య శశిరేఖ ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గ్రామ శివారులోని కాసిరెడ్డి చెరువు సమీపంలో అస్థి పంజరం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఘటన స్థలిలో దొరికి కొడవలి, షర్ట్, ప్యాంట్ ఆధారంగా శ్రీనివాస్ మృతదేహంగా గుర్తించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

రామారెడ్డి: మతిస్థిమితం లేని వ్యక్తి ఉరేసుకొని ఆత్మ హత్య చేసుకున్న ఘటన రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్ తెలిపి న వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన కుమ్మరి సత్తయ్య (30) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.గత నాలుగు నెలలుగా అతనికి మతిస్థిమితం కోల్పోవడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు.బుధవారం వేకువజామున గ్రామ పల్లె ప్రకృతి వనంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.మృతుడి కుమారుడి ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైపేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

బోధన్‌టౌన్: పట్టణంలోని శక్కర్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు. స్టేషన్ సమీపంలోని చెట్ల పొదల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకోగా వారి నుంచి రూ. 3,100 నగదు, ఐదు సెల్ ఫోన్లు, మూడు బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



కమ్మరి పండరి(ఫైల్)

పెద్దకొడప్‌గల్: బైక్‌పై నుంచి పడి తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ పండరి ఈ నెల 10న అంజని గ్రామంలో నిర్వహిస్తున్న అఖండ హరినామ సప్తాహం కార్యక్రమంలో పాల్గొనేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. రోడ్డుపై ధాన్యం కుప్పలు ఉండడాన్ని గమనించని అతను వాటిపై ప్రయాణించడంతో కిందపడిపోయాడు. తలకు తీవ్రమైన గాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

తాడ్కోల్‌లో మరో వ్యక్తి..

బాన్సువాడ రూరల్: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ అశోక్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బాన్సువాడ మండలం తాడ్కోల్‌కు చెందిన కుర్మసాయిలు (51) గ్రామంలో పనులు చేస్తూ జీవిస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 9న కుమార్తె వివాహం విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో ఆర్థిక ఇబ్బందులతో సాయిలు ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు నిజామాబాద్‌కు తరలించిగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

రామారెడ్డి: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్యాల చంద్రకాంత్(23) ఆటో నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి ఇంట్లో పడుకోగా బుధవారం వేకువజామున తల్లి అతన్ని లేపగా చలనం లేకుండా ఉండడంతో మృతి చెందినట్లు గుర్తించారు. తండ్రి రాజమల్లు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్



ఎల్లారెడ్డి: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై మహేశ్ బుధవారం తెలిపారు. మహ్మద్‌నగర్‌కు చెందిన రాజేశ్వర్‌రెడ్డి ట్రాక్టర్ నిజాంసాగర్ కెనాల్ నుంచి అక్రమంగా ఇసుకను ఎల్లారెడ్డి మండలం ఆజామాబాద్ గ్రామానికి తరలిస్తుండగా అన్నాసాగర్ శివారులో ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం: హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ కామారెడ్డి కోర్టు తీర్పు వెల్లడించింది. వివరాలిలా ఉన్నాయి. మద్నూర్ మండలం కుర్ల గ్రామానికి చెందిన తూకమణి అలియాస్ పంచశీల అనే మహిళ 2019 ఆగస్టు 12న హత్యకు గురైంది. ఆమె కుమారుడు శెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. నిందితుడు అదే గ్రామానికి చెందిన బాగెలివార్ సంతోష్‌గా గుర్తించారు. మృతురాలికి అప్పట్లో సంతోష్‌తో పరిచయం ఏర్పడడంతో చనువుగా ఉండేవారు. సంతోష్‌కు పెళ్లి సంబంధాలు వస్తుండటంతో తూకమణి తననే పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తెచ్చింది. దీంతో నిందితుడు సంతోష్ ఆమెను హత్య చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు గతంలోనే సంతోష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నాటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. సాక్ష్యాలను పరిశీలించిన జడ్జి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు, రూ.4 వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సీఐలు సాజిద్, నరేశ్, ఎస్సైలు అశోక్ కుమార్, విజయ్ కొండా, పోలీసుల తరపున వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్ గౌడ్, లైజనింగ్ అధికారి మురళి, కానిస్టేబుల్ సాయి, కృష్ణలను ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు.

పశువుల వాహనం బోల్తా

బాన్సువాడ రూరల్: మండలంలోని బుడిమి గ్రామ శివారులో పశువులతో కూడిన ఓ వాహనం బోల్తాపడటంతో వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు బాన్సువాడ సీఐ అశోక్ తెలిపారు. సాటాపూర్ నుంచి హైదరాబాద్ వైపు పది ఎడ్లను వ్యానులో తీసుకెళ్తుండగా ప్రమాదం చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పశువుల అక్రమ తరలింపుపై బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు.

న్యూసెన్స్ చేసిన వ్యక్తికి జైలు

వర్ని: వర్ని పీఎస్ పరిధిలోని గోవురు గ్రామానికి చెందిన కుడుముల గంగాధర్ మద్యం మత్తులో డయల్–100కు పలుమార్లు కాల్ చేసి ఇబ్బంది పెట్టినందుకు గాను బోధన్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేష తల్ప సాయి ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఈనెల 14న డయల్–100కు ఫోన్ చేసి ఇష్టానుసారంగా మాట్లాడి వారి సమయాన్ని వృథా చేసినందుకు అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.